బయట రివ్వుమంటున్న పెనుగాలి -- ఉప్పెన వస్తున్నట్టుగా సముద్రపు హోరు...

దెయ్యాలు సయ్యాటలాడుతున్నట్టుగా గదిలోని కర్టెన్లు నాట్యం చేస్తున్నాయి.

ఆపాద మస్తకం కంపించిపోతూ ఆందోళనగా బయటికి పరిగెత్తిన శిల్ప తృటిలో కిరీటి బెడ్‌ను చేరుకుంది.

ఎక్షార్సిస్ట్ సినిమా చూస్తున్నప్పటి నిశ్చలత్వంతో ప్రశాంతంగా ఆదమరిచి నిద్రపోతున్నాడు.

పాపలా మీదపడి గొంతు పిసికేయాలన్నంత రోషం వచ్చింది.

అలాచేస్తే అతని ప్రక్కనే పడుకునే అవకాశం ఉండదని అనిపించటంతో స్ప్రింగ్‌కాట్‌పై అతనికి దూరంగా ఓ అంచున సాగిలబడింది.

అతనికి చేరువులో ఒకే బెడ్‌పై పడుకున్నానన్న ఆలోచన ఆమెలో కొత్త ఊహాలకు ఊపిరి పోసింది.

క్షణాలు గడుస్తున్నాయి.

బయట వాతావరణంలో ఏ మాత్రమూ మార్పులేక పోవటంతో ఇంకా కాస్త చేరువగా వెళ్ళింది.

నిద్రలో ప్రక్కకు ఒత్తిగిలిన కిరీటి చేయి ఆమె కటిభాగంపై పడటంతో ఆమె నరాలు జివ్వుమన్నాయి.

అంతకంతకూ నిగ్రహాన్ని కోల్పోతూ అతడ్ని పెనవేసుకోవాలన్న కోర్కెకు దాసోహమై పోయింది.

ఆమె చెంపలకు చేరువలో అతని పెదవులు...

ఆమెలోని వెడిని రగిలిస్తున్నట్టుగా అతని ఉఛ్వాస నిశ్వాసాలు...

ఆమె పూర్తిగా వివసురాలైంది.

ఎక్కడో పిడుగుపడి నభం కూలిన శబ్దం...

అతన్ని పూర్తిగా పెనవేసుకుపోయింది.

తమకంతో అతడి చెంపలపై పెదవుల్ని ఆనించింది.

కిరీటి కళ్ళు తెరిచాడు.

ఏం జరుగుతున్నదీ గ్రహించటానికి అట్టే సేపు పట్టలేదు.

ఘనీభవించిన కోర్కెల వెల్లువ కరిగినట్టుగా అతడి చేతులూ బిగుసుకున్నాయి.

తీరం చేరబోతున్న నావ సుడిగుండంలా చిక్కుకున్నట్టుగా గమ్యానికి చేరువౌతున్న విమానం రన్‌వేపై క్రేష్ అయినట్టుగా ఫోన్ రింగయింది.

అతని చేతులు అలవోకగా రిసీవర్ని అందుకున్నాడు.

"ఓవర్ హెడ్‌క్రేన్ కూలి అయిదుగురు ఉద్యోగుల దుర్మరణం."

నైట్ షిఫ్ట్ ఇన్‌చార్జి నుండి అందిన సమాచారమది.

కిరీటి షాక్ తిన్నట్టుగా ఉండిపోయాడు.

మరుక్షణం కర్తవ్యం గుర్తుకొచ్చినట్టుగా శిల్ప నుండి దూరంగా జరిగి డ్రెస్ చేసుకోవటం మొదలు పెట్టాడు.

కాంక్షకు బానిసైన శిల్ప కిరీటి వింత ప్రవర్తనను క్షమించలేకపోయింది.

కోరివచ్చిన తనను కావాలని అవహేళన చేస్తున్నట్టు అనుకుంది.

క్రోధారుణ నేత్రాలతో పైకిలేచింది.

"ఎక్కడికి మీ జయశ్రీ అర్జంటుగా రమ్మని ఫోన్ చేసిందా?"

జరిగిందేమిటో తెలుసుకోకుండా విచక్షణ లేకుండా చేసిన ఆమె ఆభియోగానికి అతనిలోని సహనం చావు దెబ్బతిన్నట్టుగా చివాలున ఆమెవేపు తిరిగాడు.

"లేకపోతే అర్ధరాత్రి అర్జెంటుగా కలవమని కన్యగాని..."

"శిల్పా....." ఉరిమినట్టుగా చూశాడు.

"డోంట్ బి ఫూలిష్ ..." ఆవేశాన్ని అదుపులో ఉంచుకోవటానికి విశ్వ ప్రయత్నం చేయాల్చి వచ్చింది.

"లేకపోతే ఎన్నడూ లేనిది మీకీ అర్ధరాత్రి ఫోనేమిటి...." నిలదీస్తున్నట్టుగా అడిగింది.

"అది నీకు అనవసరం ....."

"అనే నేను కూడా ఇన్నాళ్ళూ ఉపేక్షించాను."

"కాదు.... నన్ను అడగ్గలిగే అర్హతను పోగొట్టుకున్నావు నిన్ను నేను ఎందుకు గౌరవించాలి? భార్యగా నువ్వు నాకు ఏమిచ్చావని...? డబ్బులో పెరిగిన అహంకారం తప్ప అనురాగం అంటే నీకేం తెలుసని..."

దూకుడుగా బయటికి వెళ్ళిపోయాడు కిరీటి .....

తలతీసేసినట్టయింది శిల్పకు.

ఉబికి వస్తున్న కన్నీటిని ఆపటం చేతకాక బావురుమంటూ కుప్పళా కూలిపోయింది.

## 10

చెప్పాచెయ్యకుండా వచ్చేసిన శిల్పను చూసి ఆశ్చర్యపోయారు రంగనాధంగారు.

అలా అర్ధాంతరంగా రావటానికి కారణం కనుక్కోవాలని మనసులో ఉన్నా అడిగే ధైర్యంలేక పోయింది.

ఆ మధ్య రెండుసార్లు కూతురి సంసారం చూద్దామని చుట్టంచూపుగా వెళ్ళి అక్కడి పరిస్థితుల్ని చూచాయగా అర్థం చేసుకోవటమేకాకుండా 'భర్త దగ్గర కాస్త ఒద్దికగా ఉండాలమ్మా' అని నచ్చ చెప్పబోతే శిల్ప అన్న చీదరింపు మాటలింకా ఆయన మరిచిపోలేదు.

"ఒక వ్యసనానికి నన్ను కన్నారు.... మరెన్నో దుర్వ్యసనాలకు అప్పులపాలై మిమ్మల్ని కాపాడుకోడానికి నా బ్రతుకును బలి చేశారు." అంటూ మనసు మొద్దుబారి పోయేటట్టు శిల్ప

అందుకే ఏదో రాద్ధాంతం జరిగి ఉంటుదని అనిపించినా గుట్టుచప్పుడు చేయకుండా ఉండిపోయాడు.

అంతేకాకుండా శిల్పకు భయపడి హైద్రాబాద్ రేసులకు బయలుదేరాల్సిన ఆరోజు ప్రోగ్రాం కూడా విరమించుకున్నాడు.

శిల్ప ఉన్నవాళ్ళు అలవాటుగా ప్రతి సాయంకాలం వెళ్ళే అనకాపల్లి జార్జి క్లబు ఛాయలక్కూడా పోగూడదనుకున్నారు.

వచ్చి వారం రోజులు అయినా శిల్ప వెళ్ళాలన్న ప్రయత్నం ఏమి చేయక పోయేసరికి, అల్లుడి నుండి ఏమీ లేకపోయేసరికి రంగనాధం గారిలో అలజడి ఎక్కువైంది.

పోనీ ఫోన్ ద్వారా ఇద్దరూ మాట్లాడుకున్నా స్పర్ధలేమీ లేవని సరిపెట్టుకునేవారు.

పగలంతా ఏవో ఆలోచిస్తూ ఫోను దగ్గరే కూర్చునే కూతురి అంతర్యమేమిటో ఆయనకు ఒక పట్టాన అర్థం కాలేదు.

శిల్ప అందరిలాంటి ఆడపిల్ల అయితే అన్న పూర్ణమ్మయినా జోక్యం చేసుకొని ఆరాతీసేది...

కిరీటి స్వయంగా వచ్చి క్షమార్పణలు చెప్పుకుంటాడని కనీసం ఫోన్ అయినా చేసి తిరిగి వచ్చేయమని ప్రాధేయపడతాడని ఎదురు చూసిన శిల్ప ఆశ నిరాశే అయింది.

ఆనాడు తనను దింపి వెళ్ళిన కారు తిరిగి వస్తుందని కారు డ్రైవరు చేతికి ఓ ఉత్తరం ఇచ్చి పంపుతాడని రేయింబవళ్ళు ఎదురు చూసేది...

ఒకనాడు అనుకోకుండా శిల్ప క్లాసుమేటు, ప్రాణ స్నేహితురాలు అయిన సునీత రావటంతో ఆమెకు కొండంత ఊరట కలిగినట్టయింది.

సునీతకు శిల్పకంటే రెండేళ్ళముందే పెళ్ళయింది. భర్తతో రాజమండ్రిలోనే ఉంటుంది.

కుశల ప్రశ్నలయిన తర్వాత శిల్ప దాంపత్యం గురించి అడిగిన సునీత ఆమెనుండి ఆశించిన విధంగా సమాధానాలు లేక పోవటంతో చూచాయగా అర్థం చేసుకుంది.

తామెంత అన్యోన్యంగా ఉండేదీ, శిల్ప వివాహానికి రావాలని ఎంత ప్రయత్నించినా ఒక్కరోజైనా తనను చూడకుండా ఉండలేక భర్త ఏ విధంగా ప్రాధేయపడి తన ప్రయాణాన్ని ఆపు చెసిందీ కథలు కథలుగా చెప్పింది.

పేపరు మిల్లులో ఫోర్‌మెన్‌గా పనిచేస్తూ కంపెనీ వ్యవహారంపై నెలరోజులుగా ఢిల్లీలో ఉంటూ పుట్టినింటిలో ఉన్న తనకు వారానికి ఎన్ని ఉత్తరాలు రాసేది ఏమేమీ రాసేది రసవత్తరంగా వివరించింది.

సునీత అనుభవించే దాంపత్య జీవితంలో కనీసం పదిశాతమైనా తను నోచుకోలేక పోయినందుకు ఎంతో బాధపడిన శిల్ప సిగ్గువదిలి తన కథనంతా ఆమెకు వినిపించింది.

ఓపిగ్గా అంతా విన్న సునీత "తప్పంతా నీదేనే పిచ్చిమొద్దూ"అంటూ తేల్చేసరికి నివ్వెరపోయింది.

“అలా గుర్రుగా చూడటం కాదే శిల్పా.... నేను నిజాయితీ గానే చెబుతున్నాను. పాపం ఆ మహాశయుడు నిన్ను ఎక్కడో ఎప్పుడో చూసి అమాంతం ప్రేమించేసి ఎలాగైనా నిన్ను పెళ్ళి చేసుకోవాలని శపథం పట్టేసి ఉంటాడు. దానికి అవకాశాలు కలిసి వచ్చాయి. అంత సుందరాంగుడు, అంత గొప్పవాడు నీదగ్గరనుండే కట్నం గుంజాల్సింది పోయి ఎదురు కట్నమిచ్చి చేసుకుంటే ఇంతలా అపార్థం చేసుకోవటమెందుకే ...పైగా ఆ ఒళ్ళుమంటతో ప్రతిక్షణం అతన్ని మానసికంగా చిత్రవధ చేసి దగ్గరకు రాకుండా చేశావు. ఇప్పుడు అతనే నీదగ్గరకు రావటంలేదని బాధపడిపోతున్నావు...దారుణం సుమా”....

“అదికాదే... ఆ తర్వాత నా అంతట నేనుగా ఎత ప్రయత్నించినా బెట్టు చేస్తుంటేనూ....”

“చేయక ఏంచేస్తాడు... మరో మగాడైతే విడాకులిచ్చి తరిమేసేవాడు. అసలు మొదటి రాత్రినాడే అతని మనసును ముక్కలు చేశావు.... నీ అహంకారంతో అతని సెంటిమెంట్స్ పై చావు దెబ్బ తీశావు.... బుద్ధున్నమగాడేవారూ భరించలేనంత క్రూరంగా ప్రవర్తించావు.... నిజం శిల్పా నువ్వు చాలా అదృష్టవంతురాలివి..... అత్తమామల పోరు లేదు. ఆడ పడచుల సాధింపులేదు..... కాలుక్రింద పెట్టనక్కర్లేనంతగా ఆస్థిపాస్తులు-- సంఘంలో బోలెడంత పరపతి.... నీ అభిరుచుల్ని గౌరవించే అనుకూలుడైన భర్త....”

“అది సరేనే.....కాని గతంలోని అఫైర్స్ మాటేమిటి...?”

“అసలు అఫైర్స్ ఉన్నాయని గ్యారెంటీ ఏమిటి? ఎవరో మూడో వ్యక్తి అసూయతో చెప్పిన మాటల్ని నువ్వినటమేమిటి. ఒకవేళ బోడి ఎఫైర్స్ ఏదన్నా ఉందే అనుకో. అది గతానికి సంబంధించిందయితే నువ్వు వర్తమానంలో వెర్రెత్తి పోవటమెందుకు? కావాలని పదేపదే గుర్తు చేసి బలవంతంగా గతంలోకి నెట్టకూడదు... ఒకవేళ నీ స్థానంలో నేనే ఉన్నాననుకో..... ఆయన్ని బ్రతిమాలి బామాలి గతం చెప్పేట్టు చేసేదాన్ని..... అది గాయం చేసిన గతమైతే నా అనురాగంతో మాయం చేసే ప్రయత్నం చేసేదాన్ని. నిజాయితీగా నాతో అంతా చెప్పినందుకు ఆయనపై మరింత మక్కువ పెంచుకునే దాన్ని..... అంతేగాని నేను అనురాగాన్ని పంచక పోవటమే కాకుండా మరింత టెన్షన్ సృష్టించి చేజేతులా సంసారాన్ని నరకప్రాయం చేసుకునే దాన్ని కాదు....”

పశ్చాత్తాపంతో శిల్ప తల వాలిపోలేదు కాని సునీత మాటలు కొద్దిపాటి ఆలోచనలను రేకెత్తించాయి.

“పిచ్చిదానా..... ఎన్నో వ్యవహారాలమధ్య తలమునకలయ్యే నీ భర్తకు కావలసింది నీ ఆదరణ, ఆప్యాయత.... నీ మూర్ఖత్వంతో సంసార జీవితాన్నెందుకు ఛిద్రం చేసుకుంటావు. వెళ్ళు.... అసలు అతని అనుమతి లేకుండా నువ్వు రావటమే తప్పు. ఇంకా ఆయన వస్తాడని వచ్చి నిన్ను ప్రాధేయపడి తీసుకువెళ్తాడనుకోవటం దురాశ....”

“...............”

“[illegible]

పశ్చత్తాపపడుతున్నట్టుగా ఓ పేరా డైలాగ్స్ చెప్పు. వెర్రి ఆనందంతో అక్కున చేర్చుకుంటాడు వీర మానవుడు.      ఇహపోతే అతన్ని ఎప్పుడో ఎక్కడో చూసినట్టుందన్నావు, చూశావా దానికి జవాబొక్కటే..“మేరేజస్ ఆర్ మేడిన్‌హెవిన్” అన్నారు. కాబట్టి అప్పుడెప్పుడో అడ్వాన్సుగా హెవెన్‌లోనే చూసుంటావు... అయినా నువ్వన్నట్టు ఏదో దురుద్ధేశ్యంతోనే నిన్ను పెళ్ళి చేసుకున్నాడనుకో. నిన్ను సంతోషపెట్టాలని అంతగా తాపత్రయపడాల్సిన  అవసరమేమిటి....? అందుకే హరికథలా అంతా విని ఊరుకోక ఓ ఎడాది తిరక్కుండా వీలైతే కవల పిల్లల్ని కని మీ పిల్లలకు మంచి పేర్లు పెట్టి వెళ్ళి పోతాను” ఉడికిస్తున్నట్టుగా అంది.

సునీత పుట్టినూరు అదే కాబట్టి సాయంకాలం వరకు కబుర్లు చెప్పి వెళ్ళిపోయింది.

ఆ రాత్రే శిల్పకు చాలా సేపటి వరకూ నిద్ర పట్టలేదు.

సునీత చెప్పిన మాటలు పదేపదే గుర్తుకురాసాగాయి.

అర్ధరాత్రి కావటం మూలాన ఎక్కడా అలికిడి వినబడటం లేదు.  దూరంగా కుక్కల అరుపులు తప్ప...

వెన్నెల జలతారును ఒంటినిండా కప్పుకుని కొత్త పెళ్ళి కూతురిలా  చప్పుడు చేయకుండా సాగిపోతుంది శారదానది.

తోటలోని పూల చెట్లు ముత్తయిదువుల్లా ముసిముసిగా నవ్వుతుంటే మెల్లగా గది తలుపుల్ని తెరిచింది.

పూల తోటతో మాట్లాడాలని, పలకరిస్తున్న పూల మధ్య కూర్చుని పులకరించి పోవాలని మనసు తొందర చేస్తుంటే మెల్లగా బయటకు నడవబోయి హఠాత్తుగ ఆగిపోయింది.

నాన్నగారి గదిలోంచి సన్నగా ఏవో మాటలు వినబడుతున్నాయి...

మరుక్షణం గాజుల గలగలలు.....

శిల్ప చూపుల్లో ఆశ్చర్యం .... అనుమానం ...తెలుసుకోవాలన్న ఉత్సుకత.... సవ్వడి చేయకుండా  ముందుకు నడిచింది....

కిటికీ సందుగుండ లోపలికి చూసి షాక్ తిన్నట్టుగా చలించిపోయింది.

నాన్న పరుపుపై అన్నపూర్ణమ్మ.....

ఆమెను ఆశ్రయించుతూ నాన్నగారు...

అసహ్యంతో, జుగుప్సతో గభాలున తల తిప్పుకుంది.

ఊహించని దృశ్యం  తన ఏమరపాటును గుర్తుచేసే నీచాతినీచమైన సన్నివేశం.....

గదిలోకి వచ్చి నిస్సత్తువుగా సోఫాలో చతికిలబడింది.

ఏమిటి తను చూసింది?